
ఆంధ్రజ్యోతి



నంద్యాల
జిల్లా వార్తలు 5
శనివారం 28 డిసెంబరు 2024

చలనమేది..?

- గోడౌన్‌లో బియ్యం మాయంపై పెదవి విప్పని అధికారులు
- గోడౌన్ యజమానులను కనీసం విచారించని వైనం
- వివరాలు సేకరించే పనిలో ఉన్నామంటూ దాటవేత



బేతంచర్లలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

నంద్యాల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఏదైనా అవినీతికి సంబంధించిన విషయం బయటపడితే అధికారులు వెంటనే అప్రమత్తమవుతారు. అక్కడ ఏం జరిగిందని ఆరా తీసి నిజానిజాలను నిగ్గు తేల్చే పనిలో పడతారు. కానీ జిల్లా యంత్రాంగం, అధికారుల తీరు మాత్రం అందుకు భిన్నంగా ఉంది. 'బుగ్గన బంధువుల గోడౌన్‌లో బియ్యం మాయం', 'పేదల బియ్యానికి రెక్కలు' పేరిట 'ఆంధ్రజ్యోతి' గురువారం కథనాలను ప్రచురించింది. ఈ విషయాల పట్ల జిల్లా యంత్రాంగం నుంచి గానీ, సంబంధిత అధికారుల నుంచి కనీస స్పందన లేదు. అంతేగాకుండా అందుబాటులో లేకుండా పోయిన బుగ్గన బంధువులను కనీసం విచారించిన దాఖలాలు లేవు. మొత్తానికి బియ్యం అక్రమార్కులను అధికారులు కాపాడే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అవసరం లేని చోట గోడౌన్లు

పీడీఎస్ బియ్యం సరఫరా చేసేందుకు బేతంచర్లలో గోడౌన్‌లు అవసరమే లేదు. ఇక్కడి నుంచి సరఫరా చేయకముందు డోన్, బేతంచర్ల, ప్యాపిలి, బనగానపల్లె ఎంఎల్ఎస్ పాయింట్లకు ఇతర ప్రాంతాల నుంచి సరఫరా అయ్యేవి. బుగ్గన ఒత్తిడితో సివిల్ సప్లైస్ అధికారులు బేతంచర్లలో గోడౌన్‌లు ఏర్పాటు చేసేందుకు పూనుకున్నారు. దీనికోసం బుగ్గన రెండు ప్రైవేటు గోడౌన్‌లు ఏర్పాటు చేయించి ఒకటి రాష్ట్ర వేర్ హౌస్‌కు లీజుకు ఇవ్వగా, మరొకటి ఆయన అనుయాయులు ప్రైవేటుగా నడుపుకునేందుకు వీలుగా అధికారులను ఒప్పించినట్లు ఆరోపణలున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో పంట ఉత్పత్తులను, పంట నిల్వలను దాచుకునేందుకు స్టేట్ వేర్ హౌస్ గోడౌన్లను వాడుకోవాలని, దీనివల్ల ప్రైవేటు గోడౌన్లకు ప్రత్యేకంగా ప్రభుత్వ ఖజానా నుంచి ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదని 2022లో ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వైసీపీ ప్రభుత్వం చెప్పిన మాటలను వారి మంత్రులు, నాయ కులు పట్టించుకోకుండా ప్రైవేటు గోడౌన్లను ప్రోత్సహించి స్టేట్ వేర్‌హౌస్ గోడౌన్లను భ్రష్టు పట్టించారు.

ఖర్చు తడిసి మోపెడు..

రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్ల వద్ద నుంచి బియ్యం సేకరిస్తోంది. ఆ తర్వాత బియ్యాన్ని రైల్వే వ్యాగన్ల ద్వారా ఆయా ప్రాంతాలకు చేరవేస్తుంది. అదేవిధంగా పీడీఎస్ బియ్యం ఇతర జిల్లా నుంచి నంద్యాల బఫర్ గోడౌన్లకు చేరుతాయి. ఇక్కడ నుంచి బేతంచర్లతో పాటు మిగతా ఎంఎల్ఎస్ పాయింట్లకు పంపిస్తారు. అయితే బుగ్గన చెప్పినట్లు విన్న సివిల్ సప్లైస్ అధికారులు బేతంచర్లలో గోడౌన్ ఏర్పాటు చేశారు. దీంతో నంద్యాల వరకు మాత్రమే పరిమితమయ్యే రైల్వే వ్యాగన్ బేతంచర్ల వరకు వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడి నుంచి మళ్లీ ఆయా ఎంఎల్ఎస్ పాయింట్లకు, అక్కడి నుంచి డీలర్లకు తరలించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సివిల్ సప్లైస్ శాఖ మీద భారీ ఖర్చు పడుతోంది. నంద్యాల నుంచి డోన్, ప్యాపిలి, కోయిలకుంట్ల, బనగానపల్లె ఎంఎల్ఎస్ పాయింట్లకు తరలించేందుకు రూ.12,98,946 ఖర్చు అవుతుండగా, బేతంచర్ల నుంచి ఆయా ఎంఎల్ఎస్ పాయింట్లకు తరలించేందుకు దాదాపు రూ.9.32 లక్షలు ఖర్చు అవుతోంది. అంటే నెలకు దాదాపు రూ.3.66 లక్షలు మిగులుతోంది. చూసే వారికి బేతంచర్లలతో బఫర్ గోడౌన్‌లు ఏర్పాటు చేయటం సబబే అనిపిస్తుంది. కానీ ఇక్కడే ఓ మతలబు ఉంది. తణుకు నుంచి పీడీఎస్ బియ్యం నంద్యాలకు తరలించడానికి దాదాపు రూ.19.69 లక్షలు ఖర్చు అవుతుండగా, తణుకు నుంచి బేతంచర్లకు తరలించడానికి రూ.21.60 లక్షలు అవుతోంది. అంటే బియ్యం తరలించిన ప్రతిసారి రూ.1.91 లక్షలు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. బేతంచర్లలో ఏర్పాటు చేసిన గోడౌన్లకు నెలకు బాడుగ రూపంలో రూ.10,35,700 ఖర్చు అవుతోంది. అలా కాకుండా నంద్యాలలో ఉన్న గోడౌన్లు వాడుకుంటే ఈ బాడుగ రూపంలో చెల్లించే మొత్తం మిగులుతుంది. అంటే బేతంచర్ల వరకు రైల్వే వ్యాగన్ వెళ్లేందుకు అయ్యే ఖర్చు, అక్కడి బఫర్ గోడౌన్ల ఖర్చు కూడా మిగులటంతో పాటు, అక్కడ సరుకును దించేందుకు అయ్యే హమాలీ, గూడ్సు నుంచి గోడౌన్లకు చేరవేసేందుకు అయ్యే ఖర్చు నెలకు దాదాపు రూ.10 లక్షలు సివిల్ సప్లైస్ శాఖకు ఆదా అవుతుంది. ఈ లెక్కన సంవత్సరానికి రూ.1.20 కోట్లు మిగులుతాయి. బుగ్గన బంధువుల జేబులు నింపడానికి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్న సివిల్ సప్లైస్ అధికారుల తీరును చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

సాధారణంగా ప్రతి నెలా బేతంచర్లకు కోనసీమ నుంచి, నంద్యాలకు పశ్చిమ గోదావరి నుంచి బియ్యం వ్యాగన్ వస్తున్నట్లు సమాచారం. అయితే ఈ సారి బేతంచర్ల బఫర గోడౌన్‌లోని మాయమైన బియ్యం విషయం బయటపడకుండా ఉండేందుకు పశ్చిమ గోదావరి నుంచి నంద్యాలకు రావాల్సిన బియ్యం వ్యాగన్‌ను బేతంచర్లకు మళ్లించినట్లు తెలుస్తోంది. ఇక తనిఖీలు చేసే సమయంలో ప్రైవేటు గోడౌన్ల యజమానులు అందుబాటులో లేకుండా పోయినా వారిని పిలిచి వివరాలు సేకరించిన దాఖాలు లేవు. ఇలా ఒక్కొక్క విషయాన్ని కలుపుకుంటే పోతే జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖ అధికారులు, బియ్యం అక్రమార్కుల మధ్య బంధం బలంగానే సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తనిఖీలకు సంబంధించిన వివరాలను సంబంధిత శాఖ డీఎం రాజు నాయక్‌ను అడగ్గా పై అధికారులకు తెలియజేస్తున్నామని, ఆ తర్వాత ఏం జరిగిందో వివరిస్తామని చెబుతున్నారు.

ప్రజాధనాన్ని అక్రమార్కుల జేబుల్లో నింపుతున్నారు

నంద్యాల నుంచి మిగిలిన ఎంఎల్ఎస్ పాయింట్లకు పీడీఎస్ బియ్యాన్ని తరలించవచ్చు. ఇందుకోసం బేతంచర్లలో బఫర్ గోడౌన్ అవసరమే లేదు. నంద్యాల నుంచి ఆయా ఎంఎల్ఎస్ పాయింట్లకు బియ్యాన్ని చేరవేడానికి అయ్యే ఖర్చు కంటే బేతంచర్ల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు బియ్యాన్ని చేరవేసే ఖర్చు తక్కువగానే ఉంటుంది. కానీ బఫర్ గోడౌన్ల బాడుగ, రైల్వే వ్యాగన్ రవాణా ఖర్చు, హమాలీ, వాహనాల రవాణా ఖర్చుతో పోల్చుకుంటే ఇది చాలా తక్కువ. ఇదంతా వైసీపీ నాయకుల మెప్పు కోసం అధికారులు చేస్తున్న పని. పీడీఎస్ బియ్యంలో అక్రమాలకు పాల్పడిని వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదు. వారందరిపై పీడీ యాక్టు నమోదయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- మహేశ్ నాయుడు, ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్

నీళ్లు.. నిధులు..!

2024 రౌండప్



ఉమ్మడి కర్నూలు రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు పురిటిగడ్డ. కరువు నేలకు సస్యశ్యామలం చేసే కేసీ కాలువ, గాలేరు-నగరి ప్రాజెక్టు, హంద్రీ-నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం.. ప్రాజెక్టు ఏదైనా కందనవోలు ముంగిట నుంచి జల అడుగులు పడాలి. అంతటి ప్రాధాన్యత కలిగిన సీమ ప్రాజెక్టులకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శించారు. నిధులు లేక పలు ప్రాజెక్టులు అటకెక్కించారు. కనీసం నిర్వహణకు కూడా నిధులు ఇవ్వని దైన్య పరిస్థితిని కల్పించారు. 2024 ఎన్నికల ఏడాది.. ఫిబ్రవరి 7న ఆనాటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో నిధులు ఇవ్వకుండా నిరాశే మిగిల్చారు. జూన్ 12న సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరాక సాగునీటి ప్రాజెక్టులు నూతన కళను సంతరించుకున్నాయి. తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోతే మన రాష్ట్రం కాకపోయినా సీఎం చంద్రబాబు ప్రాజెక్టుల గేట్ల నిపుణుపుడు కన్నయ్యను పంపి కందనవోలు పశ్చిమ రైతుల కన్నీళ్లు తుడిచారు. నవంబరు 11న టీడీపీ కూటమి ప్రభుత్వం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్‌లో జిల్లా ప్రాజెక్టులకు రూ.445.81 కోట్లు కేటాయించారు. సాగు నీటి సంఘాల ఎన్నికలు పూర్తి చేశారు. కాలువల మరమ్మతులకు చర్యలు చేపట్టారు. శ్రీశైలం డ్యాం ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. 2024లో కందనవోలు సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులపై పరిశీలిస్తే..



- వైసీపీ హయాంలో పడకేసిన ప్రాజెక్టులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రత్యేక దృష్టి
- 2024-25 బడ్జెట్‌లో రూ.445.81 కోట్ల కేటాయింపు
- హంద్రీనీవా కాలువ విస్తరణకు వేగంగా చర్యలు

కర్నూలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), గాజులదిన్నె ప్రాజెక్టు, కర్నూలు-కడప (కేసీ) కాలువ, తెలుగుగంగ ప్రాజెక్టు, శ్రీశైలం కుడిగట్టు కాలువ (ఎస్సార్బీసీ) ప్రధాన సాగు, ఆలూరు బ్రాంచ్ కాలువ, శివ భాష్యం ప్రాజెక్టు, హంద్రీనీవా కాలువ.. వంటి సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయి. ఆయా నీటి వనరుల కింద 6.56 లక్షల ఎకరాలకు సాగు నీరందాల్సి ఉంది. వైసీసీ ప్రభుత్వం వచ్చాక రాయలసీమ దుర్భిక్ష నివారణ ప్రాజెక్టు పేరిట ఉన్న ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కర్నూలు జిల్లాలో పశ్చిమ పల్లెసీమలకు సాగు, తాగు నీరందించే లక్ష్యంగా చేపట్టి వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టులు అటకెక్కించారు. నాడు జగన్ ప్రభుత్వం వల్ల కందనవోలు ప్రాజెక్టులు అంతులేని నిర్లక్ష్యానికి గురయ్యాయి. జూన్ 12న సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం రావడంతో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, కొత్త ప్రాజెక్టుల నిర్మాణాలపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఆ దిశగా ప్రభుత్వం వేగంతమైన చర్యలకు ఉపక్రమించింది. ఆగస్టులో తుంగభద్ర డ్యాం 19వ నంబరు గేటు కొట్టుకుపోవడంతో కర్నూలు జిల్లాలో ఎల్లెల్సీ ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. సీఎం చంద్రబాబు తక్షణమే క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడును టీబీపీ డ్యాంకు పంపించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించారు. 30 టీఎంసీలు కడలిపాలు కాకుండా రక్షించారు. కరువుపల్లె రైతుల సాగు ఆశలు పదిలం చేశారు.



వేదావతి ప్రాజెక్టు పైపులు ఇలా పడేశారు

వైసీపీ హయాంలో నిర్లక్ష్యం

ఎన్నికల ఏడాది.. అందులోనూ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఉమ్మడి జిల్లా వాసే. బడ్జెట్‌లో నిధులకు ఢోకా ఉండదని ఆశపడడంలో తప్పులేదు. ఈ ఏడాది ఆరంభం ఆరు నెలలు వైసీపీ అధికారమే ఉంది. ఫిబ్రవరి 7న నాటి ఆర్థిక మంత్రి బుగ్గన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు నిధులు కేటాయింపులు ఎండమావులే అయ్యాయి. హంద్రీనీవా కాలువ నుంచి 68 చెరువుల నింపే ప్రాజెక్టు గత టీడీపీ ప్రభుత్వం చేపడితే.. ఆ ప్రాజెక్టు తానే తెచ్చినట్లుగా బడ్జెట్ ప్రసంగంలో చెప్పారే తప్పా నిధుల ఊసే లేదు. రూ.వేల కోట్లు బకాయి పెట్టారు. గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకం వంటి ఎత్తిపోతల పథకాల నిర్వహణకు నిధులు ఇవ్వలేదు.

పుచ్చకాయలమడ లిఫ్ట్‌కు రూ.6.50 కోట్లు

పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామంలో అక్టోబరు 1న ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించారు. ప్రజావేదిక సభలో పాల్గొన్నారు. మీ గ్రామానికి ఏమి కావాలో కోరుకోమని రైతులను చంద్రబాబు అడిగారు. 'మా గ్రామం పక్కనే హంద్రీనీవా కాలువ ప్రవహిస్తుంది.. మా పంట పొలాలకు చుక్కనీరు అందక ఏటేటా పంటలు ఎండిపోయి నష్టపోతున్నాం.. లిఫ్ట్ ఏర్పాటు చేసి సాగునీరు ఇవ్వాలి' అని రైతులు కోరారు. ఈ మేరకు జలవనరుల శాఖ ఇంజనీర్లు రూ.6.50 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం పంపారు. 800 ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా హంద్రీనీవా కాలువ 121 కిలోమీటర్ల వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే ఈ ప్రాజెక్టు కార్యారూపం దాలుస్తుందని అంటున్నారు. అలాగే.. రాయలసీమలో 6.50 లక్షల ఎకరాలకు సాగునీటి ఆశయంలో నిర్మించిన హంద్రీనీవా కాలువ విస్తరణకు రూ.1,500 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

టీడీపీ కూటమి వచ్చాక ప్రాజెక్టులకు జీవం

ఈ ఏడాది సగంలో జూన్ 12న సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు జలజీవం వచ్చింది. సీమ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించారు. కూటమి ప్రభుత్వంలో నవంబరు 11న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ 2024-25 పూర్తి స్థాయి బడ్జెట్ కేటాయించారు. ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులు రూ.445.81 కోట్లు కేటాయించారు. కేసీ కెనాల్, కుందూ, నిప్పులవాగు రూ.253.10 కోట్లు కేటాయించడం కొసమెరుపు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మరమ్మతులకు నోచుకోని గురురాఘవేంద్ర ఎత్తిపోతల ప్రాజెక్టు సహా తుంగభద్ర ప్రాజెక్టు దిగువ కాలువ (ఎల్లెల్సీ), ఆర్డీఎస్, వేదవతి, గాజులదిన్నె ప్రాజెక్టులకు రూ.115.39 కోట్లు కేటాయించారు. గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యం పెంపు పనులకు వైసీపీ హయాంలో బిల్లులు ఇవ్వక పనులు ఆపేస్తే కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.11.79 కోట్లు కేటాయించి పనులు ప్రారంభానికి బీజం వేసింది. శ్రీశైలం డ్యాం శాశ్వత మరమ్మతులకు ప్రపంచ బ్యాంక్ ఆమోదం తెలిపింది.

మిగతా 6లో..



ఆర్డీఎస్ కుడి కాలువ హెడ్ స్లూయిస్

30 నుంచి దేహదారుఢ్య పరీక్షలు

ఎస్పీ జి. బిందుమాధవ్



మాట్లాడుతున్న ఎస్పీ జి.బిందుమాధవ్

కర్నూలు క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా కానిస్టేబుళ్ల అభ్యర్థులకు ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 1 వరకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్పీ జి.బిందుమాధవ్ తెలిపారు. ఇందుకు స్థానిక ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో అన్ని ఏర్పాట్లను పోలీసు అధికారులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిజికల్ మెజర్మెంట్ అండ్ ఎఫీషియన్సీ పరీక్షలను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలన్నారు. పరీక్షల నిర్వహణ సిబ్బంది బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఏపీఎస్ఎల్ఆర్‌బీ ఆదేశాలు, నియమ నిబంధనల మేరకు ఈ పరీక్షలు సవ్యంగా జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఉద్యోగం సాధించాలనే ఒత్తిడిలో అభ్యర్థులు ఉంటారని, వారి పట్ల మర్యాదగా, సహనంతో వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. ఈ దేహదారుఢ్య పరీక్షలకు సుమారు 10 వేల మంది అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు. అభ్యర్థులకు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత బయోమెట్రిక్, ఎత్తు, ఛాతి వంటి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు, ఫిజికల్ ఎఫీషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు ఉంటాయని తెలిపారు. రిజల్ట్ కౌంటర్ వరకు అంచెలంచెలుగా సమగ్రంగా విధులు నిర్వర్తించేలా అవగాహన కల్పించారు.

అభ్యర్థులు ఆయా తేదీల్లో నిర్దేశిత సమయంలోనే చేరుకోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలన్నారు. ఏమైనా సందేహాలు, సమస్యలుంటే పోలీసు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్‌పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, జిల్లా పోలీసు కార్యాలయం సూపరింటెండెంట్లు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు

కర్నూలు, న్యూసిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు శనివారం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో జి.నాసర రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీలోని మినీ సమావేశ భవనంలో ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని పేర్కొన్నారు. ఉదయం 10.30నుంచి 11.30 గంటల వరకు రెండో స్థాయి సంఘం, 11.30 నుంచి 12 గంటల వరకు మూడో స్థాయి సంఘం, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు 6వ స్థాయి సంఘం, మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు 4వ స్థాయి సంఘం, 3 గంటల నుంచి 4 వరకు 5వ స్థాయి సంఘం, 4 నుంచి 6 గంటల వరకు 1,7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈవో తెలిపారు.

ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి

కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు విపత్తు నివారణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకునేందుకు సంబంధిత శాఖలు నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ముందస్తు జాగ్రత్త చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల జిల్లాలోని వాగులు ఉప్పొంగడం వల్ల గ్రామాల మధ్య రహదారుల రాకపోకలు నిలిచిపోయాయని అన్నారు. నంద్యాల పట్టణానికి ఆనుకొని ఉన్న కుందూ నదిలో కుందేరు, బుగ్గవంక, పాలేరు, గాలేరు, మద్దిలేరు, సప్పిటి వాగులు కలవడం, వాగుల చుట్టూ ఉన్న స్థలాలు ఆక్రమణలకు గురికావడం వల్ల భారీ వర్షాలు కురిసినా, వరదలు వచ్చినా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. ఆక్రమణలు అరికట్టడంతో పాటు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలని అన్నారు. ఆత్మకూరు డివిజన్లో ఇటీవల కురిసిన వర్షాలకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే పొలాలు దెబ్బతిన్నాయని తెలిపారు. అవసరమై చోట్ల బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు ఇవ్వాలని కలెక్టర్ ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవడంతో బోర్ల ఫ్లషింగ్, డీపనింగ్ బోర్‌వెల్స్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్‌వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పదోన్నతులు



పదోన్నతి పత్రాలను అందజేస్తున్న ఈవో

శ్రీశైలం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులు పదోన్నతులు పొందారు. దేవస్థానం పర్యవేక్షకులుగా విధులు నిర్వహిస్తున్న కె.సాయికుమారి, కె.వెంకటేశ్వరరావుకు ఏఈఓలుగా పదోన్నతి పొందారు. సీనియర్ అసిస్టెంట్లు రంగన్న, ఆర్.మల్లికార్జున, డి.నాగేశ్వరరావు, హరికృష్ణారెడ్డి, ఎం.శ్రీనివాసరావులు పర్యవేక్షకులుగా పదోన్నతి కల్పిస్తూ ఈవో ఎం.శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమణమ్మ, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి ఉన్నారు.

బొమ్మ పలుకుద్ది..!

- తాకగనే వన్యప్రాణుల అరుపులు, వాటి సమగ్ర సమాచారం ప్రత్యక్షం
- బైర్లూటి ఎకో టూరిజంలో ఆకట్టుకునేలా పర్యావరణ విద్యా కేంద్రం



పర్యావరణ కేంద్రంలో ప్రదర్శించిన పులి ప్రతిమ

> టచ్ చేస్తే చాలు బొమ్మ పలుకుతుంది. ముట్టుకోగానే ఆ జంతువు అసలు అరుపు వినబడుతుంది. ఇటువంటి విచిత్రమైన వన్యప్రాణుల బొమ్మలకు బైర్లూటి ఎకో టూరిజం కేంద్రంగా మారింది. పర్యావరణ ప్రేమికులకు వింత అనుభూతి కలిగిలే అటవీ శాఖ ఇక్కడ చర్యలు చేపట్టింది. ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో బైర్లూటి ఎకో టూరిజంను 2017లో ఏర్పాటు చేశారు. నిర్దిష్టప్యాకేజీని నిర్ణయించి పర్యాటకులు అడవిలో గడిపేలా కాటేజీలను కూడా అందుబాటులో ఉంచారు. అదే క్రమంలో జంగిల్ సఫారీ పేరిట ఓపెన్ టాప్ జీపులో విహరించే అవకాశం కూడా కల్పించారు. అడవి అందాలు, వన్యప్రాణులను వీక్షిస్తూ ఆహ్లాదంగా ముందుకు సాగవచ్చు.

ఆత్మకూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన వాతావరణంలో ప్రకృతి అందాల నడుమ నిర్మించిన పర్యావరణ విద్యా కేంద్రం ఆశ్చర్యానికి కలిగించేలా ఉందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. పెద్దపులి, చిరుత, ఎలుగుబంటి, కృష్ణజింక, దుప్పులు, కణితి, మణుబోతు, రేసు కుక్కలు, చుక్కల దుప్పి, నక్కలు, కొండముచ్చు, కొండచిలువ, నెమలి, అడవికోడి, ముళ్లపంది ఇలా పలు రకాల వన్యప్రాణులతోపాటు పక్షులు, క్షీరదాల బొమ్మలను అసలైనవే అన్నట్లుగా రూపొందించారు. వాటి పరిధిలో టెక్నాలజీతో కూడిన నాలుగు మానిటర్లను ఏర్పాటు చేసి ఒక్కో మానిటర్‌కు ఆ సమీపంలో ఉండే జంతువులు చిత్రాలను స్ర్కీన్‌లో కనిపించేలా రూపొందించారు. మానిటర్‌లో కనిపించేలా జంతువు లేదా పక్షుల ఫొటోను టచ్ చేసినట్లయితే మానిటర్ స్టాండ్‌కు ఏర్పాటు చేసిన లైట్ నుంచి వెలుతురు వస్తుంది. ఏ జంతువు స్ర్కీన్‌పై క్లిక్ చేశామో ఆ జంతువుపై లైటింగ్ పడేలా అమర్చారు. అంతేకాదు.. తక్కువ లైటింగ్‌తోపాటు సైలెంట్‌గా ఉండే ఈ సెంటర్‌లో ఒక్కసారిగా అ జంతువుపై వెలుతురు పడి అరుపు వినిపించేలా సెట్ చేశారు. అదే క్రమంలో ఆ జంతువు లేదా పక్షికి సంబంధించిన సమగ్ర వివరాలు కూడా స్ర్కీన్‌పై ప్రత్యక్షమయ్యేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. అక్కడ అమర్చిన బరువు, ఎత్తు కొలిచే మెషిన్ల వద్ద సరిచూసుకుంటే మన ఎత్తు, బరువు ఏ జంతువుతో పోలి ఉన్నామో అందులో కనిపించేలా వాటిని అమర్చారు. నల్లమల చెంచుల జీవన విధానం ప్రతిబింబించే ప్రతిమలను కూడా అందులో పొందుపర్చారు. ఇలా అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేయబడిన ఎన్విరార్‌మెంటల్ ఎడ్యుకేషన్ సెంటర్ బైర్లూటి ఎకో టూరిజం వచ్చే పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది.



చెంచుల జీవన విధానం ప్రతిబింబించేలా..



బైర్లూటిలోని పర్యావరణ విద్యా కేంద్రం

పర్యాటకుల మధురానుభూతి కోసమే..

బైర్లూటి ఎకో టూరిజానికి వచ్చే పర్యాటకులు జంగిల్ సఫారీకి వెళ్తుంటారు. కొన్ని సందర్భాల్లో సఫారీలో ఏఒక్క వన్యప్రాణి కూడా కనిపించకపోవడంతో వారు కొంత నిరుత్సాహానికి గురయ్యే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎకో టూరిజం వద్ద ఏర్పాటు చేసిన పర్యావరణ విద్యా కేంద్రంలో నల్లమలలో సంచరించే ప్రధానమైన జంతువులు, పక్షుల ప్రతిమలను ఏర్పాటు చేసి వాటి అరుపులను (గాండ్రిపులను) స్వయంగా వీక్షిస్తూ వినేలా ఏర్పాటు చేశాం. ఇది పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఇక్కడ ఉపయోగించిన టెక్నాలజీని చూసి పర్యాటకులే ఆశ్చర్యానికి లోనవుతున్నారు.

- సాయిబాబా, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్









ఆకట్టుకునేలా వన్యప్రాణుల ప్రతిమలు



మానిటర్‌లో కనిపిస్తున్న వన్యప్రాణుల చిత్రాలు

టిఫిన్ ఎలా ఉందమ్మా?

అన్న క్యాంటీన్ల ఆహార నాణ్యతపై నగర పాలక కమిషనర్ ఆరా

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): టిఫిన్ టేస్ట్ ఎలా ఉందమ్మా? అంటూ అన్న క్యాంటీన్ల వద్ద అల్పాహారం చేస్తున్న ప్రజలను నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆరా తీశారు. అల్పాహార రుచి, నాణ్యతలను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం కొండారెడ్డి బురుజు వద్ద అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. క్యాంటీన్ల వద్ద ఎప్పటికప్పుడు స్వచ్ఛత పనులు చేపడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. పేదలకు మూడు పూటలా రుచికరమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించిందన్నారు.



అల్పాహార రుచులపై ప్రజలను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ రవీంద్రబాబు

ఉర్దూ భాషకు జీవం పోసిన కవి మీర్జా గాలిబ్

ఉర్దూ వర్సిటీలో జయంతి వేడుకల్లో ఇద్రిస్ అహమ్మద్



ఉర్దూ వర్సిటీలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న అతిథులు

కర్నూలు అర్బన్, డిసెంబర్ 27(ఆంధ్రజ్యోతి):దేశంలో ఉర్దూ భాషాకు జీవం పోసిన కవి మీర్జా గాలిబ్ అని ఢిల్లీలోని గాలిబ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ మహమ్మద్ ఇద్రిస్ అహమ్మద్ కొనియాడారు. శుక్రవారం నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ఉర్దూ కవి మీర్జా గాలిబ్ జయంతి వేడుకను పురస్కరించుకుని గాలిబ్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం హైబ్రిడ్ (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్)పద్ధతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి, ప్రొఫెసర్ పీఎస్ షావళీఖాన్ మాట్లాడుతూ ఉర్దూ సాహిత్య చరిత్రలో గొప్ప కవుల్లో ఒకరైన మీర్జాను స్మరించుకోవడానికి గాలిబ్ డేను జరుపుకోవడం అభినందనీయమన్నారు. రిజిస్ట్రార్ లోక్‌నాథ్ మాట్లాడుతూ గాలిబ్ తన గజల్స్, ద్విపదల ద్వారా భావోద్వేగాలను సంగ్రహించడానికి ఎంతో తపన పడ్డారన్నారు. వర్సిటీ పాలక మండలి సభ్యులు జీఎండీ ఇబ్రహీమ్, నవీద్ పర్వేజ్, ఆజ్రాజావేద్, ఇక్బాల్ ఖుస్రో ఖాద్రీ, సయ్యద్ జహీర్ అహమ్మద్ పాడిన గేయాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో ఉర్దూ శాఖ అధ్యక్షుడు జె. మొహనుద్దీన్ హుస్సేనీ, డాక్టర్ అమతుర్ రహీమ్, మాజీ రిజిస్ట్రార్ సత్తార్ సాహెబ్, కంట్రోలర్ ఖాసీం ఆలీ, కవులు, భాషా ప్రేమికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవనకొండ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోండి

ఆర్డీవోను ఆదేశించిన కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించిన దేవనకొండ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా పత్తికొండ ఆర్డీవోను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి హౌసింగ్, రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్, పంచాయతీ రాజ్, సీసీ రోడ్లు, ఉపాధి హామీ, ఎంఎస్ఎంఈ సర్వే తదితర అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న పంచాయతీ రాజ్ ఇంటర్నల్ సీసీ రోడ్ల పనులకు సంబంధించి జిల్లాలో 812 సీసీ రోడ్ల పనులు, 17 అప్రోచ్ రోడ్లు పనులకు గానూ ఇప్పటి వరకు 682 పనులు పూర్తి చేసి 82 శాతం పురోగతి సాధించి రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్నామన్నారు. కోడుమూరు చిప్పగిరి, ఓర్వకల్లు, నందవరం, ఎమ్మిగనూరు, ఆదోని, వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాలు ఉపాధి పనులు కల్పించడంలో చాలా వెనుకబడి ఉన్నారని, చిన్న చిన్న కారణాలు చెబుతూ పనులు కల్పించకపోవడం ఏమిటని అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. వీసీలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, డ్వామా పీడీ వెంకట రమణయ్య, డీపీవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

పరీక్ష పే చర్చ వంద శాతం నమోదవ్వాలి

జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పరీక్ష పే చర్చ వంద శాతం నమోదవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి జనవరి 14వ తేదీ వరకు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉందన్నారు. పరీక్షల ఒత్తిడిని తగ్గించడానికి ఉద్దేశించిన ఈ కార్యక్రమాన్ని ప్రచారం చేయడానికి ప్రోత్సహించడానికి పాఠశాలలు వినూత్న చర్యలను అవలంబించాలని సీబీఎస్ఈ ఇప్పటికే కోరిందని తెలిపారు. ఈ పోటీకి గరిష్ఠ సంఖ్యలో విద్యార్థులు నమోదయ్యేలా చూడాలని ఇదివరకే ఎంఈవో, హెచ్ఎంలను సమావేశాలు నిర్వహించి ఆదేశించామన్నారు. 2025 జనవరిలో ఢిల్లీలోని భారత్ మండపంలో పరీక్షా పే చర్చా-2025 జరగనుందని, ఈ పరీక్ష పే చర్చా 8వ ఎడిషనల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ప్రధాని ముఖాముఖి మాట్లాడుతారని వెల్లడించారు. రాబోవు మూడు రోజుల్లో వంద శాతం పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మెప్మా సీఎంఎం విజయభాస్కర్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి కోరారు. నైపుణ్య అభివృద్ధి సహకారంతో శిక్షణ పొందేవారి కోసం పేర్ల నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం బాలభవన్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్లంబింగ్, కార్పెంటరీ, ఎలక్ట్రికల్, వాటర్ ప్యూరిఫైర్ సర్వీసెస్, ఏసీ మెకానిక్స్, రిఫ్రిజిరేటర్ రిపేర్, వాషిన్‌మెషిన్ సర్వీస్, టీవీ రిపేర్, బ్యూటీషియన్స్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ లోపల చిన్నపార్కు పక్కనే ఉన్న బాలభవన్ కార్యాయలంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సీసీఐ కొనుగోళ్లు పునఃప్రారంభం

మళ్లీ మూడు రోజులు సెలవు

6300 మంది రైతుల నుంచి 1.47 లక్షల క్వింటాల పత్తిని రైతుల నుంచి సీసీఐ కొనుగోలు చేసింది.

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతులకు కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్న కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మూడు రోజుల సెలవు అనంతరం శుక్రవారం కొనుగోళ్లను ప్రారంభించింది. ఒక్కరోజే కొనుగోలు చేసి నేడు శని, ఆదివారంతో పాటు సోమవారం అమావాస్య కావడంతో మళ్లీ మూడు రోజుల కొనుగోళ్లను నిలుపుదల చేసింది. ఇప్పటికే మార్కెట్‌లో మద్దతు ధర కంటే పత్తికి తక్కువ ధర పలుకుతుంది. కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని పత్తి రైతులు వాపోతున్నారు. మరోవైపు నిబంధనల సాకుతో విక్రయ కేంద్రాలకు తెచ్చిన పత్తిని తిరస్కరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు



సిరుగుప్ప రహదారులోని సీసీఐకి విక్రయించేందుకు వచ్చిన పత్తి వాహనాలు

నీళ్లు.. నిధులు..!



గాజులదిన్నె జలాశయం

(5వ పేజీ తరువాయి)

వైసీపీ హయాంలో కేంద్ర ప్రభుత్వం నిధులు వినియోగించుకోవడంలో ఘోర వైఫల్యం చెందితే.. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ ఆరు నెలల్లోనే కేంద్ర ప్రభుత్వం నిధులు సద్వినియోగం చేసుకొని ఆయా ప్రాజెక్టుల మరమ్మతులు, ఆధునికీకరణకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా మూడు దశల్లో సాగు నీటి సంఘాల ఎన్నికలను పూర్తి చేసింది. ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన (పీఎంకేఎస్‌వై), ప్రపంచ బ్యాంకు నిధులతో కాలువల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. పీఎంకేఎస్‌వై రిపేర్స్-రెనోవేషన్-రిస్టోరేషన్ (ఆర్ఆర్ఆర్) లో భాగంగా మేజర్, మైనర్ ప్రాజెక్టుల కింద కాలువలు, సిస్టమ్ ట్యాంకుల శాశ్వత మరమ్మతులు, ఆధునికీకరణ కోసం ప్రతిపాదనలు తయరు చేయమని ఇప్పటికే ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో దాదాపుగా రూ.రూ.1,558 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. ఈ ఆరు నెలల్లోనే చంద్రబాబు ప్రభుత్వం నీటి వనరుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది.

టీడీపీ కూటమి ప్రభుత్వం ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు కేటాయింపులు రూ.కోట్లలో..

ప్రాజెక్టులు	బడ్జెట్
ఎల్లెల్సీ, ఆర్డీఎస్, వేదావతి ప్రాజెక్టులు	13.00
కేసీ కెనాల్, కుందూ, నిప్పులవాగు	253.10
ఎస్ఆర్‌బీసీ	44.06
గురురాఘవేంద్ర ప్రాజెక్టు	69.04
68 చెరువులు	20.00
గాజులదిన్నె ప్రాజెక్టు	11.79
శ్రీశైలం జల విద్యుత్ కేంద్రం	2.23
సిద్ధేశ్వరం ఎత్తిపోతల పథకం	6.29
శ్రీశైలం ప్రాజెక్టు	26.30
మొత్తం	445.81

2025లో ఈ ప్రాజెక్టులపై దృష్టి సారించాలి

- ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగు నీరు, 196 గ్రామాలకు తాగునీరు అందించాలని గత చంద్రబాబు ప్రభుత్వం వేదావతి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నిర్మాణానికి 2019లో రూ.1,942.38 కోట్లు మంజూరు చేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక పనులు అటకెక్కాయి. నూతన సంవత్సరంలో పనులు మొదలు పెట్టాలి.
- మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లోనే వలసల నివారణ కోసం గత టీడీపీ ప్రభుత్వం ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. 2019 జనవరిలో రూ.1,985.42 కోట్లు మంజూరు చేసింది. వైపీపీ వచ్చాక పనులు ఆపేశారు. 2025లో ఆర్డీఎస్ పనులకు శ్రీకారం చుట్టాలి.
- తుంగభద్ర నదిపై 20 టీఎంసీలు సామర్థ్యంలో గుండ్రేవుల జాశయం నిర్మాణానికి రాష్ట్ర విభజన తరువాత టీడీపీ ప్రభుత్వం రూ2,890 కోట్లు మంజూరు చేస్తే తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అంతర్‌రాష్ట్ర సమస్య అంటూ పక్కన పడేసింది. జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని కూటమి ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరిపి పనులు మొదలయ్యేలు చర్యలు చేపట్టాలి.
- పత్తికొండ (పందికోన) జలశయం కుడి ఎమడ హంద్రీనీవా కాలువలు పూర్తి చేస్తే 65 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చు. అందుకు రూ.200 కోట్లు అవసరమవుతాయి. రాబోయే ఏడాదైనా పనులకు మోక్షం లభించేలా చూడాలి.
- ఆత్మకూరు నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న సిద్ధాపురం ఎత్తిపోతల పథకం కాలువలు పూర్తి చేసి పూర్తి ఆయకట్టుకు సాగునీరు ఇవాల్సిన అవసరం ఉంది.
- అసంపూర్తిగా ఉన్న అవుకు టన్నెల్ పూర్తి చేయాలి. అవుకు రిజర్వాయర్ గేట్లను మరమ్మతులు చేపట్టాలి
- కోసిగి మండలం పులికనుమ జలాశయం అదనంగా మరో ఒక టీఎంసీ సామర్థ్యం పెంపు పనులు చేపట్టాలి.

మన్మోహన్ సింగ్ సేవలు
మరువరానివి



- 2004 జూలై 1న సోమయాజులపల్లెకు రాక
- రైతు కుటుంబానికి ఆర్థిక సాయం
- చెరువు నిర్మాణానికి నిధులు మంజూరు
- అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్న గ్రామస్థులు



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ నిధులు మంజూరు చేసిన చెరువు ఇదే

ఓర్వకల్లు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సేవలను సోమయాజులపల్లెవాసులు నేటికీ గుర్తు చేసుకుంటున్నారు. ఆయన సేవలు మరువలేనివని కొనియాడుతున్నారు. సోమయాజులపల్లెకు చెందిన రైతు పెద్ద కురువ రంగన్న అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆయన భార్య పార్వతమ్మతోపాటు మిగతా రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం అందించేందుకు 2004 జూలై 1న నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సోమయాజులపల్లెకు చేరుకున్నారు. బాధిత కుటుంబాలకు పరిహారం చెక్కులు అందజేశారు. గ్రామానికి సాగు నీరు లేదని మన్మోహన్ సింగ్ దృష్టికి రైతులు తీసుకెళ్లడంతో రూ.కోటి నిధులు మంజూరు చేశారు. సంవత్సరంలోపే చెరువు నిర్మాణం పూర్తి చేసి పొలాలకు సాగు నీరు అందించారు. ఆ చెరువు కింద దాదాపు 350 ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా బోర్లలో కూడా భూగర్భ జలాలు పెరిగాయి. ఇప్పటికీ ఆ గ్రామంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను స్మరించుకుంటున్నారు.



పరిహారం చెక్కును అందజేస్తూ..



నాటి ప్రధాని చేసిన సేవలు మరువరానివి

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి తీరని లోటు. మా గ్రామానికి ఆయన వచ్చి రైతులందరితో కలిసి చెరువు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరడంతో తక్షణమే స్పందించారు. రూ.కోటి నిధులు మంజూరు చేసి చెరువు నిర్మాణం చేపట్టారు. ఆయన రుణం తీర్చుకోలేనిది. **- కాకి దేవేంద్ర, రైతు**



350 ఎకరాలకు సాగు నీరు

ప్రధాని మన్మోహన్ సింగ్ చొరవతో చెరువు నిర్మాణం చేపట్టడంతో 350 ఎకరాలకు సాగు నీరు అందుతోంది. అదేవిధంగా బోర్లలో కూడా భూగర్భ జలాలు పెరిగాయి. ఆయన మరణం తీరని లోటు.

- రామ మద్దిలేటి, రైతు

దేశం గొప్పనేతను కోల్పోయింది : ఎంపీ బస్తిపాటి

కర్నూలు అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి బాధాకరమని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు. దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందన్నారు. దేశ రాజకీయాల్లో మన్మోహన్ సరికొత్త శకాన్ని సృష్టించారన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతి తీరని లోటు



మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్, కాంగ్రెస్ నాయకులు

నంద్యాల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, దేశ మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటు అని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. మన్మోహన్‌సింగ్ మృతిపట్ల జిల్లా కాంగ్రెస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం నంద్యాల కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్, కాంగ్రెస్ నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1991లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు కేబినెట్‌లో ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన మన్మోహన్‌సింగ్ దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి గ్లోబల్ ఎకానమీగా తీర్చిదిద్దారని కొనియాడారు. 2004నుంచి 2014వరకు భారత ప్రధానిగా సేవలు అందించిన మన్మోహన్‌సింగ్ దేశ ఆర్థిక వ్యవస్థను సుస్థిరం చేయడంలో, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడంలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు పఠాన్ హబీబ్‌ఖాన్, బాలస్వామి, రజాక్‌వలి, రమణ, జాకీర్‌హుసేన్, విశ్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు డీసీసీ ఆధ్వర్యంలో...



మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు అని కర్నూలు డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మన్మోహన్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పీజీ రాంపుల్లయ్య యాదవ్, సుధాకర్‌బాబు, సత్యనారాయణ గుప్త, దామోదరం రాధాకృష్ణ, వెంకట శివారెడ్డి, బ్రతుకన్న, అనంతరత్నం, షేక్‌ఖాద్రీ పాషా, లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

● క్లస్టర్ వర్సిటీలో...



నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

డాక్టర్ మన్మోహన్ సింగ్ గొప్ప రాజకీయ అజాత శత్రువని ఉపకులపతి ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. క్లస్టర్ వర్సిటీలో మన్మోహన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ హేమంత్, డీన్ నాగరాజ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

కోట్ల కుటుంబంతో మన్మోహన్‌సింగ్ అనుబంధం

- పీవీ మంత్రివర్గంలో పని చేసిన మన్మోహన్, కోట్ల విజయభాస్కరరెడ్డి
- మన్మోహన్ మంత్రి వర్గంలో సూర్యప్రకాశ్‌రెడ్డి

కర్నూలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్‌సింగ్ (92)కు కర్నూలు జిల్లాతో అనుబంధం ఉంది. ఆ మహోన్నత వ్యక్తితో కర్నూలు జిల్లాకు చెందిన దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి కుటుంబానికి ఎనలేని అనుబంధం ఉంది. కాంగ్రెస్‌లో సీడబ్ల్యూసీ సభ్యులుగా కోట్ల విజయభాస్కరరెడ్డి, మన్మోహన్‌సింగ్ ఇద్దరు పని చేశారు. 1991లో భారత ప్రధానమంత్రిగా పీవీ నరసింహారావు బాధ్యతలు చేపట్టారు. పీవీ మంత్రివర్గంలో మన్మోహన్‌సింగ్ ఆర్థిక శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తే.. జిల్లాకు చెందిన పెద్దాయన కోట్ల విజయభాస్కరరెడ్డి న్యాయ, కంపెనీ వ్యవహారాలు బాధ్యతలు చేపట్టారు. ఇద్దరి మధ్య రాజకీయంగా సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. 1992లో కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి కోట్ల విజయభాస్కరరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా రెండోసారి బాధ్యతలు చేపట్టారు. ఏపీ సీఎంగా కోట్ల వివిధ ప్రాజెక్టులకు నిధుల కోసం పలుమార్లు అనాటి ఆర్థిక శాఖ మంత్రి మన్మోహన్‌సింగ్‌ను కలిసి పలు రాజకీయ అంశాలే కాకుండా రాష్ట్ర అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టులు, సంస్కరణలపై చర్చించేవారని అంటున్నారు. కోట్ల విజయభాస్కరరెడ్డి మరణాంతరం ఆయన రాజకీయ వారసుడిగా కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి కర్నూలు ఎంపీగా ఎన్నికయ్యారు. 2004, 2009లో జరిగిన రెండు పర్యాయాలు ఎంపీగా గెలిచారు. రెండో పర్యాయం ప్రధానిగా మన్మోహన్‌సింగ్ బాధ్యతలు చేపట్టిన తరువాత మంత్రివర్గ విస్తరణ సమయంలో కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డికి రైల్వే సహాయ మంత్రిగా అవకాశం కల్పించారు. తమ కుటుంబంతో మన్మోహన్‌సింగ్‌కు ఉన్న పరిచయం కారణంగా అనాటి ప్రధాని మన్మోహన్‌ను ఒప్పించి జిల్లాకు రైల్వే కోచ్ మరమ్మతుల పరిశ్రమను తీసుకొచ్చారు. ఈ రోజు భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మన మధ్య లేరని, తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని తెలిసి కోట్ల అనుచరులు, ముఖ్యంగా కాంగ్రెస్ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు.



మన్మోహన్ సింగ్‌తో విజయభాస్కర్ రెడ్డి(ఫైల్)

వ్యక్తి ఆత్మహత్య

ఎమ్మిగనూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని సున్నంబట్టి ప్రాంతంలో బెస్త సీతారామరాజు(26) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సీతారామరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే భార్య వివాహేతర సంబంధంతో ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన సీతారామ రాజు శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలమూరులో చోరీ

- 5 తులాల బంగారు, రూ.50 వేలు అపహరణ

పాణ్యం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చొరబడి 5 తులాల బంగారు, రూ.50 వేలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు వెంకటసుబ్బయ్య తెలిపారు. ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చేలోపు ఇంట్లో దొంగతనం జరిగిందని పాణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సంఘటనపై నంద్యాల క్లూస్ టీం వేలిముద్రలు సేకరించిందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ముగ్గురికి జైలు శిక్ష

నంద్యాల క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ముగ్గురు వ్యక్తులకు 30 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ జ్యుడీషియరీ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేసినట్లు నంద్యాల తాలుకా పోలీసులు తెలిపారు.

నంద్యాల పట్టణంలోని బైటిపేటకు చెందిన వడ్డ రాజశేఖర్, దళితవాడకు చెందిన పెద్దమాతంగి లక్ష్మయ్య, బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన చాకలి మధురాజు అనే ముగ్గురు వ్యక్తులు గురువారం నంద్యాల మండలంలోని నందమూరినగర్ వద్ద రోడ్డుపై వెళ్తున్న మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు నంద్యాల తాలుకా పోలీసులు తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి వారికి జైలు శిక్ష విధించడంతో సబ్‌జైల్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలి



విద్యుత్ ఎస్ఈకి వినతిపత్రం అందిస్తున్న కాటసాని

- వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- వైసీపీ ఆధ్వర్యంలో కాటసాని గృహం నుంచి ర్యాలీ

కల్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని పాణ్యం మాజీ ఎమ్మెల్యే, నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. వైసీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు శుక్రవారం కాటసాని స్వగృహం నుంచి వైసీపీ శ్రేణులు బళ్లారి చౌరస్తా మీదుగా కర్నూలు జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఎన్నికల ప్రచారంలో విద్యుత్ చార్జీలు పెంచము వీలైతే తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ప్రజల నడ్డి విరిచేలా కరెంట్ చార్జీలు పెంచడం సరైందికాదన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎం. ఉమాపతికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ మేయర్ ఎస్.రేణుక, కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, వైజా అరుణ, దండు లక్ష్మీకాంతరెడ్డి, చిట్టెమ్మ, ఇప్పల నారాయణరెడ్డి, బెల్ల మహేశ్వరరెడ్డి, కల్లూరు, ఓర్వకల్లు, పాణ్యం, గడివేముల మండలాల వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాము తనిఖీ



గోదాముకు వేస్తున్న సీల్‌ను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాల టెక్కె మార్కెట్‌యార్డులోని ఈవీఎం గోదామును కలెక్టర్ రాజకుమారి పర్యవేక్షించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గోదాములకు వేసిన సీల్‌ను ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈవీఎంల గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్వో రామునాయక్, ఆర్డీవో విశ్వనాథ్, ఎన్నికల విభాగపు తహసీల్దార్ జయప్రసాద్, రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు పాపం వైసీపీదే



పసుపునీళ్లతో శుద్ధి చేస్తున్న టీడీపీ నాయకులు

- టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్

కల్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపు పాపం గత వైసీపీ ప్రభుత్వానిదేనని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిందని వైసీపీ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈమేరకు కర్నూలు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్‌తో కలిసి ఆయన వైసీపీ నాయకులు ర్యాలీ చేసిన ప్రాంతాన్ని శుక్రవారం పసుపునీటితో శుద్ధి చేశారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ కన్వీనర్ డి.రామాంజనేయులు, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ఎస్.పిరోజ్, టీడీపీ జిల్లా కోశాధికారి పీయూ.మాధన్న, ఎన్వీరామకృష్ణ, సంపతి లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 354 అర్జీల స్వీకరణ

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం 24 గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 354 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని గోనెగండ్ల మండలం వేముగోడు 15, నందవరం మండలం గురుజాల గ్రామంలో 3, ఎమ్మిగనూరు మండలం మల్కాపురంలో 5, కోసిగిత మండలం ఆర్లబండలో 20, కౌతాళం మండలం బాపురంలో 11, మంత్రాలయం మండలం కల్లుదేవకుంటలో 4, పెద్దకడుబూరు మండలం మేకడోనలో 2, ఆదోని మండలం సాంబగల్లులో 7, నెట్టేకల్లులో 3, హోలగుంద మండలం నగరకన్వి గ్రామంలో 9, కోసిగి మండలం పుట్టకుంట గ్రామంలో 0, కౌతాళం మండలం ఖాత్రికిలో 6, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని కర్నూలు అర్బన్‌లోని రోజావీదిలో 6, ఓర్వకల్లు మండలం శకునాలలో 8, కల్లూరు మండలం బొల్లవరంలో 39, వెల్దుర్తి మండలం చెరుకులపాడులో 11, కర్నూలు రూరల్‌లోని నిడ్జూరు గ్రామంలో 12, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని పత్తికొండ మండలం పెద్దహుల్తిలో 6, తుగ్గలి మండలం రాతనలో 9, క్రిష్ణగిరి మండలం పోతుగల్ గ్రామంలో 125, మద్దికెర మండలం బురుజులలో 38, ఆలూరు మండలంలోని ముసనహల్లి గ్రామంలో 6, చిప్పగిరి మండలంలోని నన్నిచెర్లలో 4, ఆస్పరి మండలం బినిగేరిలో 5, మొత్తం 354 అర్జీలను స్వీకరించామని డీఆర్వో తెలిపారు.

గతంలో పెంచిన విద్యుత్ చార్జీలే శాపాలు

- వైసీపీ ఆందోళనలపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ధ్వజం



కర్నూలు అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల పాలనలో పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి నేడు ఆందోళనలు చేయడం సిగ్గుచేటని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డారు. జగన్‌రెడ్డి చేసిన పిచ్చి పాలనలో రాష్ట్ర ప్రజలు విసిగి వేసారి పోయారని, ఫలితంగానే ప్రతి పక్ష హోదా కూడా ఇవ్వలేదన్నారు. రైతు సమస్యలంటూ గత 13న ఒక నాటకం ఆడితే దాన్ని ప్రజలు పట్టించుకోలేదన్నారు. నేడు విద్యుత్ చార్జీల పేరుతో మరో నాటకానికి తెరలేపాడని మండిపడ్డారు. జగన్ పరదాల చాటున పాలన సాగించి, ప్రజల గురించి ఏనాడు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని ఏడారిలా మార్చేసి. కోట్లాది ప్రజాధనాన్ని దోచేసుకోవడంతోను, కక్షపూరిత రాజకీయాలతో అక్రమ కేసులు, హత్యాచారాలు, ఇసుక, మద్యం, గంజాయి, మైనింగ్ దందా, భూ దందాలతో మాఫియాలతో పాలక సాగించి ప్రజల ఆస్తులను సైతం దోచుకున్నారడన్నారు. విద్యుత్ ఉత్పత్తికి మారు పేరైన ఏపీ జెన్‌కో జగన్మోహన్‌రెడ్డి నాశనం చేశాడన్నారు. ప్రజలకు విద్యుత్ అవసరాలు అనే పేరుతో జగన్‌రెడ్డి తన అస్మదీయుల నుంచి అధిక రేట్లకు విద్యుత్ కొనుగోలు చేయించి విద్యుత్ రంగాన్ని నాశనం చేశాడన్నారు. కేవలం ఉనికి కోసమే ఇలాంటి చౌక బారు కార్యక్రమాలు చేపుడుతున్నారని, ఇకనైనా వాటికి స్వస్తి పలికి నిజాలు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ చార్జీల పెంపు భారం జగన్‌రెడ్డిదే

విద్యుత్ చార్జీల పెంపు పాపం వైఎస్ జగన్మోహన్ రెడ్డి దేనని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్ అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

గతంలో సీఎంగా ఉన్న సమయాన ఆనాలోచిత విధానాలతో పెంచిన విద్యుత్ చార్జీలపైన వైసీపీ ఆందోళనలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. పెంచిన చార్జీలను జగన్ రెండేళ్ల క్రితం వేయాల్సిందని తన ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, తాను ఓటమి అంచుల్లో ఉన్నానని గ్రహించి వాయిదా వేశారని గుర్తు చేశారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర, ఎస్ షేక్షావలి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో సీపీఎం జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న నాయకులు రామాంజనేయులు, గోవిందు

- 29,30 తేదీల్లో నిర్వహణకు ఏర్పాట్లు
- 29న బహిరంగ సభ : సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మొదటి సారిగా సీపీఎం కర్నూలు జిల్లా 23వ మహాసభలు నిర్వహించనున్నట్లు సీపీఎం నాయకులు తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు రామాంజనేయులు, పీఎస్ రాధాకృష్ణ, స్థానిక నాయకులు గోవిందులు మహాసభల వివరాలను వెల్లడించారు. ఈనెల 29, 30 తేదీల్లో కర్నూలు జిల్లా 23వ మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 29న పట్టణంలోని కొత్త మున్సిపల్ కార్యాలయం నుంచి శ్రీనివాస సర్కిల్, ట్యాంకు బండ్ రోడ్డు, సంతమార్కెట్, సోమప్ప సర్కిల్ మీదుగా బహిరంగ సభ ప్రాంతమైన పాత తహసీల్దారు కార్యాలయం ఆవరణ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. ముఖ్య అతిథులుగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గీయులు ప్రభాకర్ రెడ్డి, వీ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, కర్నూలు జిల్లా కమిటీ సభ్యులు హనుమంతులు హాజరవుతున్నారని తెలిపారు. 30న ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. మహాసభల్లో జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనా, పెండింగ్ ప్రాజెక్టులపైన, జిల్లాకు ఇచ్చిన హామీల అమలుపైన, చేనేతల ఉపాధి అవకాశాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మొదటి సారి ఎమ్మిగనూరు పట్టణంలో జరుగుతున్న సీపీఎం జిల్లా మహాసభలకు ప్రజలు, మేధావులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, యువతీయువకులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, స్థానిక నాయకులు రాముడు, హనుమంతు, సురేష్ పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిరంతర పోరాటం

● విద్యుత్ చార్జీలు పెంచడం దారుణం ● నిరసనలు చేపట్టిన వైసీపీ నాయకులు


నంద్యాలలో ఎస్ఈకి వినతి పత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు



ఆత్మకూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

నంద్యాల రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన నిలుస్తూ పోరాటం చేస్తామని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ నంద్యాల పట్టణంలోని సాయిబాబానగర్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు వైసీపీ నాయకులు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎస్ఈ సుధాకర్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. శిల్పా రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారం దాదాపుగా రూ.15485 కోట్ల అదనపు మోపడం దారుణమని అన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించే దాకా పోరాడతామని హెచ్చరించారు. ప్రజలకు ఎన్నో మోసపూరిత మాటలు చెప్పి అధికారంలోకి కూటమి ప్రభుత్వం వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చి నేడు అధికారంలోకి రాగానే ప్రజలు విద్యుత్ భారాలు మోపడం సరికాదని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆత్మకూరు వైసీపీ కార్యాలయం నుంచి బైకు ర్యాలీగా పట్టణ శివార్లలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరుకుని అక్కడ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీశైల నియోజకవర్గం టీడీపీ నాయకులు మద్యం, రేషన్, రియల్ ఎస్టేట్ ఏదీ వదలకుండా దోచుకుంటున్నారని ఆరోపించారు. అనంతరం విద్యుత్ శాఖ డీఈ రామసుబ్రమణ్యంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఇదిలావుంటే వైసీపీ నాయకుల బైక్ ర్యాలీకి పోలీసులు అనుమతుల్లేవని అభ్యంతరం వ్యక్తం చేశారు. అర్బన్ సీఐ రాము అడ్డుకునే ప్రయత్నం చేయగా కేసులకు భయపడేదే లేదంటూ బైక్ ర్యాలీ కొనసాగించారు. నాయకులు మోమిన్ అహ్మద్‌హుసేన్, సయ్యద్‌మీర్, అంజాద్‌బాషా, కుంటా శివారెడ్డి, మునీర్ బాషా, లాలం రమేష్, అంబాల ప్రభాకరరెడ్డి, ఈశ్వరప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నందికొట్కూరు(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యుత్ చార్జీలను పెంచిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త ధార సుధీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని పటేల్ సెంటర్ నుంచి విద్యుత్‌శాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పెంచిన విద్యుత్ చార్జీలనె తగ్గించాలంటూ విద్యుత్‌శాఖ డీఈ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ధార సుధీర్ మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న పరిపాలనపై రాష్ట్ర ప్రజలు విసుగెత్తి పోయారన్నారు. కౌన్సిలర్ నాయబ్ వైసీపీ నాయకులు మన్సూర్, నాగిరెడ్డి, పోచా జగదీశ్వరరెడ్డి, సోముల సుధాకర్ రెడ్డి, కోకిల రమణారెడ్డి, రమణ, చంద్రారెడ్డి, రమేష్‌నాయుడు, అక్తర్, అశోక్‌రెడ్డి, నారాయణరెడ్డి, సులోచనమ్మ, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.


నందికొట్కూరులో అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పంటలపై పందుల దాడి

● ఆందోళనలో అన్నదాతలు


పందులు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంట

గడివేముల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించే అన్నదాతలకు అడుగడుగున ఇబ్బందులు తప్పడం లేదు. అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థిలు, చీడపీడలతో నష్టాల పాలవుతున్న అన్నదాతలకు పందులు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంట పిందే దశలో ఉండగా పందులు పంటలపై స్వైర విహారం చేస్తూ నాశనం చేస్తున్నాయి. మండల కేంద్రంలో గ్రామ సమీపంలో ఉన్న పొలాల రైతులు పందుల బెడదతో హడలెత్తిపోతున్నారు. పంటను రక్షించుకునేందుకు పంట చుట్టూ చీరలు చుట్టిన పందుల బెడద తప్పడం లేదు. ఇటీవల గడివేముల గ్రామానికి చెందిన చాంద్‌బాషా మొక్కజొన్న పొలంలో పందులు భీభత్సం సృష్టించాయి. ఏపుగా ఎదిగిన మొక్కజొన్న నేలవాలింది. పందులబెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని అన్నారు. అధికారులు స్పందించి పందుల బెడదను నివారించాలని రైతులు కోరుతున్నారు.

'కొబ్బరి సాగుపై దృష్టి సారించాలి'


సాగు విధానాల గురించి వివరిస్తున్న శాస్త్రవేత్తలు

నంద్యాల రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు కొబ్బరి సాగుపై దృష్టి సారించాలని ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుపతిరెడ్డి, ముత్యాలనాయుడు సూచించారు. పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో శుక్రవారం జిల్లా ఉద్యానశాఖ, ఉద్యాన విశ్వవిద్యాలయం, కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో కొబ్బరి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కొబ్బరి అనుకూల రకాలు, వాతావరణ పరిస్థితులను వివరించారు. వారు మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతుల్లో కొబ్బరి సాగు చేపట్టాలని సూచించారు. అశు కొబ్బరి రకం సాగుకు నంద్యాల జిల్లా అనుకూలంగా ఉంటుందని, చీడ పీడలను తట్టుకోగలదని చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు 1000 ఎకరాలలో కొబ్బరి మొక్కలు నాటినట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రాల ద్వారా సిబ్బంది ఉద్యాన పంటలపై రైతులకు సాంకేతిక సలహాలు ఇవ్వాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు సూచించారు. కోకోనట్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ కుమర్‌వెలన్ కొబ్బరి అభివృద్ధి సంస్థ ద్వారా అమలు పరిచే పథకాలు, అనుబంధ ఉత్పత్తులు, ఆదాయం గురించి వివరించారు. ఉద్యాన అధికారులు, వీహెచ్‌ఏలు, ఎఫ్‌టీవోలు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంచుకోవాలి: డీఏవో



నైపుణ్యాభివృద్ధి గురించి వివరిస్తున్న డీఏవో మురళీకృష్ణ

నంద్యాల రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సిబ్బంది నైపుణ్య సామర్థ్యాలను పెంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. నంద్యాల జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ ఉప సంచాలకులు సరళమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం క్షేత్రస్థాయి సిబ్బందికి నైపుణ్య సామర్థ్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఏవో మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న పంటలకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు తెలియజేసి నాణ్యమైన అధిక దిగుబడి సాధించేందుకు కృషి చేయాలని కోరారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం వల్ల వ్యక్తిలో విజ్ఞాన సమర్థత పెరుగుతుందని అన్నారు. అదేవిధంగా సస్యరక్షణ పద్ధతులు, తెగుళ్లను గుర్తించడం వాటిని నివారించడం, పొద్దుతిరుగుడు పంటలో పాటించాల్సిన పద్ధతులను వివరించారు. అనంతరం రైతులతో వివిధ పథకాల గురించి చర్చాగోష్టి నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్, విజయశేఖర్, అంజనేయులు పాల్గొన్నారు.

యువతకు కౌన్సెలింగ్

నంద్యాల క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు డోన్ డీఎస్పీ శ్రీనివాస్ నేతృత్వంలో రోడ్డుప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా డోన్ రూరల్ సీఐ రాకేష్ ఆధ్వర్యంలో శుక్రవారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వాహనాల పత్రాలు, డ్రైవింగ్ చేసేటపుడు ముందు జాగ్రత్త చర్యలకు సంబంధించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

నేరాల నియంత్రణపై దృష్టి పెట్టాలి: డీఎస్పీ


గడివేములలో రికార్డును పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

గడివేముల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని నంద్యాల డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఆయన గడివేముల పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మండలంలో జరిగిన నేరాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. అసాంఘిక కార్యాకలాపాల అరికట్ట డానికి చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు వాహన చోదకులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఫిర్యాదులను పరిశీలించి తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పాణ్యం సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ నాగార్జునరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల వైద్యులకు ఐఎంఏ జాతీయ పురస్కారాలు


ఐఎంఏ జాతీయ పురస్కారం అందుకుంటున్న డాక్టర్ రవికృష్ణ

నంద్యాల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ వైద్యులు రవికృష్ణ, మధుసూదన్‌రావు ఐఎంఏ జాతీయ పురస్కారాలను శుక్రవారం అందుకున్నారు. హైదరాబాద్‌లో భారతీయ వైద్య సంఘం 99వ జాతీయ మహాసభలో పురస్కారాలను అందుకున్నట్లు డా.రవికృష్ణ తెలిపారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ మూడు దశాబ్దాలలో సామాజిక సేవలకు డా.జ్యోతిప్రసాద్ గంగూలీ స్మారక జాతీయ పురస్కారం అందుకోగా, ప్రముఖ ఈఎన్‌టీ వైద్యుడు మధుసూదన్‌రావు చేసిన వైద్య సేవలకు గుర్తింపుగా ఐఎంఏ జాతీయ జీవితకాల సాధన పురస్కారం అందుకున్నారు. ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు అశోకన్, ప్రధాన కార్యదర్శి డా.అనిల్‌కుమార్ నాయక్, నూతన అధ్యక్షుడు డా.దిలీప్‌భన్సాలి చేతులమీదుగా పురస్కారాలను అందుకున్నట్లు చెప్పారు.

'సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి'

నంద్యాల క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు నంద్యాల డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో నంద్యాల త్రీ టౌన్ సీఐ సూర్యమౌళి సిబ్బందితో కలిసి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అవగాహన కల్పించారు. అలాగే మహిళలపై జరిగే నేరాల విషయంలో ఏదైనా అనుకోని సంఘటన జరిగిన వెంటనే 100, 112 నెంబర్లకు ఫోన్‌చేసి పోలీసుల సహాయాన్ని పొందవచ్చని సూచించారు. ఎవరైనా సైబర్ క్రైమ్ నేరగాళ్ల వలలోపడి మోసపోతే వెంటనే 1930నెంబర్‌కు లేదా దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ దేవేంద్రకుమార్, ప్రిన్సిపాల్, లెక్చరర్లు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు నివాళి


నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పాములపాడు డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి శుక్రవారం మాల మహానాడు నాయకులు అబ్రహాం, కలబండి అంకన్న, కాంగ్రెస్ నాయకులు షేక్షావలి పూలమాలలు వేసి నివాళి అర్పించారు వారు మాట్లాడుతూ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థిక సంస్కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుపతయ్య, ప్రజా సంఘాల నాయకులు ఖైమాకర్, ముర్తుజావలి, ప్రసాద్, ప్రవీణ్, అలీ తదితరులు పాల్గొన్నారు.

'నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు'

మహానంది, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయిలు అంకిత భావంతో పనిచేయాలని, నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తే చర్యలు తప్పవని శ్రీశైలం ఏటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటశివప్రసాద్ హెచ్చరించారు. గాజులపల్లి ఆర్ఎస్ చెంచుగూడెంలోని ఏకోపాధ్యాయ పాఠశాలను శుక్రవారం పీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల తలుపులు మూసివేయడం, అక్కడ విధులు నిర్వహించే ఉపాధ్యాయుడు నిబంధనలకు విరుద్ధంగా గ్రామంలోని మరో ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడిని పిలిపించి మాట్లాడారు. మరోసారి ఇలాగే వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధ్యాయుడికి మెమో జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

'డ్రైనేజీలు నిర్మించాలి'

ఆత్మకూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వరాజ్‌నగర్‌లో అంతర్గత సీసీ రోడ్లతో పాటు డ్రైనేజీని నిర్మించాలని సీపీఎం నాయకులు రణధీర్ కోరారు. శుక్రవారం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట కాలనీవాసులతో కలిసి నిరసన వ్యక్తం చేసి మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇప్పటికే కాలనీవాసులు చందాలు వేసుకుని వీధిదీపాలు, ఇతర సదుపాయాలు కల్పించుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సురేంద్ర, రామ్‌నాయక్, వీరన్న, షేక్ ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ

మహానంది, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపం వద్దకు అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకీ సేవ ఉత్సవాన్ని ఆలయ మెదటి ప్రాకారంలో మేళతాళాలతో నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాచమల్ల శ్రీనివాసులు, వేదపండితులు నాగేశ్వరశర్మ, హనుమంత్‌శర్మ, అర్చకులు శరభయ్యశర్మ, పుల్లారి జనార్దన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి'


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. వైఎస్ఆర్ నగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడుతో కలిసి పరిశీలించారు. ఫిరోజ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. డ్రైనేజీ, రోడ్ల పనులు జరుగుతున్నట్లు తెలిపారు. అంతేగాక కరణామయస్కూల్ రహదారికి, కచ్చ కాలువలకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఆయన వెంట మరాఠి నూరి, హనుమంతయ్య, అడ్వకేట్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విచారణ

కొత్తపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంత వెంట లభ్యమైన గుర్తు తెలియని మృతదేహాల ఆచూకీ కోసం ఆత్మకూరు సీఐ సురేష్ కుమార్ రెడ్డి శుక్రవారం ఎస్ఐ ఎం.కేశవతో కలిసి విచారణ చేపట్టారు. సీఐ మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన వీభద్ర దుర్గం, చీమలతిప్పలో, 23వ తేదీన ముసలిమడుగు గ్రామ శివారులో రెండు చోట్ల గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలు లభ్యమయ్యాయని తెలిపారు. ఈ మృతదేహాలు ఎవరివి అన్న విషయం ఇంత వరకు తెలియలేదన్నారు. దీంతో శుక్రవారం కృష్ణానది పరివాహక ప్రాంతమైన వీరభద్రదుర్గం, చీమలతిప్ప, జానాలగూడెం, బలపాలపతిప్ప, సిద్ధేశ్వరం, కపిలేశ్వరం, ఎర్రమఠం, మాడుగుల, ముసలిమడుగు గ్రామాల్లో విచారణ చేశామని చెప్పారు. తీరం వెంట ఉన్న మత్స్యకారులను క్షుణ్ణంగా విచారించామన్నారు.

ముగిసిన నామినేషన్ల స్వీకరణ


బీజేపీ నంద్యాల రూరల్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న గురుబ్రహ్మం

నంద్యాల కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని బీజేపీ కార్యాలయంలో జిల్లాలోని మండలాలకు పార్టీ అధ్యక్షుల కోసం నామినేషన్లు స్వీకరణ శుక్రవారం ముగిసినట్లు బీజేపీ జిలా ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రమౌళీశ్వరరెడ్డి తెలిపారు. బీజేపీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా కశెట్టి చంద్రశేఖర్, కశెట్టి కృష్ణమూర్తి వ్యవహరించారు. బీజేపీ మండలాల అధ్యక్షుల కోసం నంద్యాల అర్బన్, రూరల్ పరిధిలో 10 అప్లికేషన్లు వచ్చినట్లు బిజెపి ఎన్నికల రిటర్నింగ్ కశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. ఈ అప్లికేషన్లను బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి పరిశీలన నిమిత్తం పంపిస్తామని, వీటిని పరిశీలించి మండలాల అధ్యక్షులను ఎంపిక చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, శివనాగిరెడ్డి, విశ్వేశ్వరాచారి, బాలముని, సాంబిరెడ్డి, నాగేశ్వరరావు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఊయల సేవ

శ్రీశైలం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ వైభవంగా నిర్వహించారు. ముందుగా మహాగణపతి పూజ చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామ, స్వామికి సహస్ర నామార్చన, మంగళహారతులు సమర్పించారు.

● గ్రామదేవత అంకాలమ్మకు దేవస్థానం విశేష పూజలు నిర్వహించింది. ఈ పూజలలో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అలంకరణ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం

శ్రీశైలం మహాక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ పథకానికి శుక్రవారం పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన జె. నాగేశ్వరరావు దంపతులు రూ. 1,01,116 విరాళాన్ని పర్యవేక్షకులు హిమబిందుకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: పీఎంజీ


మాట్లాడుతున్న పోస్టుమాస్టర్ జనరల్ ఉపేంద్ర

మహానంది, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): తక్కువ ప్రీమియంతో ఎక్కువ లాభం పొందే పాలసీలను తపాలాశాఖ ప్రవేశపెట్టిందని, పోస్టల్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు రీజనల్ పోస్టుమాస్టర్ జనరల్ ఉపేంద్ర సూచించారు. మహానంది ఆలయంలో శుక్రవారం పీఎంజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వదించి స్వామి వారి మెమెంటో అందజేశారు. అనంతరం మహానంది సమీపంలోని ఈశ్వర్‌నగర్ కాలనీలోని పోస్టాఫీసును తనిఖీ చేశారు. గ్రామ సచివాలయం వద్ద పోస్టాఫీసు ఖాతాదారుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. పోస్టాఫీసులో చిన్నమొత్తాలతో నెలనెల పొదుపు చేసుకోవాలని సూచించారు. ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి పథకం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికి ఇన్‌స్రెన్సు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ పోస్టల్ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ ఏఎస్‌పీ సత్యనారాయణ, పార్వతి, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, ఎంవోలు నరసింహ, రామశేషిరెడ్డి, బీపీఎంలు పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత'


అవగాహన కల్పిస్తున్న మంగళగిరి డివిజన్ అటవీ అధికారి

పగిడ్యాల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మంగళగిరి డివిజన్ అటవీ అధికారి పి.సామేలు అన్నారు. పగిడ్యాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని సూచించారు. నేడు మొక్కల నాటి సంరక్షిస్తే భావి తరాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చెట్లను నరికివేయడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. విద్యార్థులు మంచి పౌరులుగా మెలగాలని, పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. అనతరం పాఠశాల సమీపంలో చెట్లను నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు రషీద్ మియ్యా, రమణరావు, పీతాంబర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎస్సీ కులగణన జాబితా ప్రదర్శన

● అభ్యంతరాల స్వీకరణకు 31 వరకు గడువు

నందికొట్కూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణనపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎస్సీ కుల గణన వివరాలను వార్డు సచివాలయంలో ప్రదర్శించినట్లు మున్సిపల్ కమిషనర్ బేబి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే డిసెంబరు 31 లోగా అభ్యంతరాలు స్వీకరిస్తామని ఆమె చెప్పారు. కావున వార్డు సచివాలయానికి వెళ్లి సంబంధించిన వివరాలను సరిచూసుకోవాలని ఆమె తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 6వ వరకు అభ్యంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర వివరాల సేకరణ అనంతరం జనవరి 10వ తేదీన కులగణన తుది వివరాలను వార్డు సచివాయలంలో ప్రదర్శిస్తామని చెప్పారు.

మిడుతూరు(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కుల గనన జాబితాలో తప్పులను సవరించుకోవాలని ఎంపీడీవో దశరథరామయ్య శుక్రవారం సూచించారు. మిడుతూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని సచివాలయాల వద్ద ఎస్సీ కల గణనకు సంబంధించిన వివరాలను ఆయా సచివాలయ నోటీసు బోర్డులో ప్రదర్శించినట్లు తెలిపారు. అభ్యంతరాలు ఉన్నట్లు అయితే ఈ నెల 31 తేదీలోపు వీర్వోలకు అర్జీ ద్వారా తెలిపి సవరించుకోవాలని సూచించారు. అబ్యంతరాలను జనవరి 6 వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి అనంతరం జనవరి 10తేదీన కుల గనన తుది జాబితాను సచివాలయాల నోటీసు బోర్డులో ప్రదర్శించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

రాష్ట్ర స్థాయి త్రో బాల్ పోటీలకు ఎంపిక


ఉపాధ్యాయులతో విద్యార్థి రాజ్‌కుమార్


పాములపాడు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థి ఎంపికైనట్లు వేంపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తి తెలిపారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థి రాజ్‌కుమార్ రాష్ట్రస్థాయి అండర్ 17 త్రో బాల్ పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. ఇటీవల నంద్యాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో త్రోబాల్ క్రీడలో మంచి ప్రతిభ కనబరచి ఈ నెల 28, 29న గుంటూరు జిల్లా పెనుమాకలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. వ్యాయమ ఉపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు విదార్థిని అభినందించారు.

'గైర్హాజరైన వారిపై ఫిర్యాదు చేస్తాం'


మాట్లాడుతున్న ఎంపీడీవో

జూపాడుబంగ్లా, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో గోపీకృష్ణ తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు రాకపోతే ప్రజాప్రతినిదులు అడిగే ప్రశ్నలకు ఎవరు సమాధానం చెప్పాలని, కొంతమంది మండల శాఖ అధికారులు హాజరుకాకుండా కిందస్థాయి అధికారులు హాజరు అవుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. కేసీ కాలువ కింద నీటి విడుదలను తగ్గించారని రబీలో సాగుచేసిన కంది, మినుము, మొక్కజొన్న పంటలకు ఆయకట్టు రైతులకు పంటకోత వరకు ఇవ్వాలని తూడిచర్ల సర్పంచ్ బాలమద్దిలేటితోపాటు సభ్యులంతా కేసీ ఏఈ శ్రీనివాసనాయక్‌ను అడిగారు. నీరు అనుకున్నంతా ప్రాజెక్టులోలేదని ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతామని చెప్పారు. ఏవో కృష్ణారెడ్డి మాట్లాడుతూ కందులు కనీస మద్దతు ధర రూ.7550కు అమ్ముకోవాలనుకున్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆకాశంలో ముసురు!



పంటలన్నీ నాశనం ● నెలంతా తుఫాన్లు ● తీవ్రంగా నష్టపోతున్న రైతులు

అకాల వర్షం రైతులను ముంచుతోంది. సాగు చేసిన అన్ని పంటలకు పెనుముప్పు తెచ్చిపెడుతోంది. ఈ నెలలో ఇప్పటి వరకు ఏడు రోజులే ఎండ కాసింది. మిగిలిన అన్ని రోజులూ సూర్యుడే కనిపించలేదు. ముసురు వాతావరణంతో రైతులకు కంటి మీద కునుకులేకుండా పోతోంది.



రుద్రవరం మండలం బి.నాగిరెడ్డిపల్లె సమీపంలో వరి ధాన్యంపై కప్పిన పట్టలు

చాగలమర్రి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా శుక్రవారం తెల్లవారుజామున తేలికపాటి వర్షం కురిసింది. 4.2 మీ.మీ వర్షపాతం నమోదైంది. శెట్టివీడు, గొడిగనూరు, ముత్యాలపాడు, మద్దూరు, పెద్దబోదనం, చిన్న బోదనం గ్రామాల సమీపంలో సర్వీసు రహదారులు, కలాల్లో ఆరబెట్టిన వరి, మినుము ధాన్యం తడిచి దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందారు. శనగ, కంది, మిరప సాగు చేసిన రైతులు పంటలు దెబ్బతినిపోతాయని ఆందోళన చెందుతున్నారు. గత నెల 27న తుఫాన్ కారణంగా మొదలైన వర్షాలు ఇప్పటి వరకు పడుతూనే ఉన్నాయి.

● **దెబ్బతిన్న కంది:** మండలంలోని ఆయా గ్రామాల్లో 700 ఎకరాలకు పైగా కంది సాగు చేశారు. వర్షాల కారణంగా కంది పూత, పిందే రాలిందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం పిందే, కాయ దశలో ఉంది. వర్షానికి పిం దెలు, కాయలు పురుగుల బారిన పడుతున్నాయి.

● **శనగ వర్ణార్పణం:** మండలంలో 2 వేల ఎకరాల్లో శనగ పంట సాగు చేశారు. పంట పూతదశలో ఉంది. శనగలో కలుపు, పురుగు ఉధృతి పెరిగిపోయింది. తుఫాన్ దెబ్బతో శనగ పంట నల్లబారి కుళ్లిపోతోంది.

● **రైతుల ఆందోళన:** బంగాళాఖాతం అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా తేలిక పాటి వర్షాలకు మండలంలోని రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ ఏడాది మినుము, శనగ, కంది, మొక్కజొన్న తదితర పైర్లను సాగు చేశారు. ఇప్పుడిప్పుడే పంటలు జీవం పోసుకుంటున్న పైర్లు అకాల వర్షాల ధాటికి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శెట్టివీడు గ్రామ సమీపంలో రహదారిపై ఆరబెట్టిన మొక్కజొన్న



మల్లేవేములలో నల్లబారిన శనగ పంట

ఆగని వర్షం

రుద్రవరం : గత నాలుగు రోజుల నుంచి వర్షం పడుతూనే ఉంది. శుక్రవారం వర్షం కురిసింది. మండలంలోని హరినగరం సమీపంలో రహదారిపై మొక్కజొన్నలు ఆరబోయగా తడిచిపోయాయి. రుద్రవరం, కొండమాయపల్లె, బి.నాగిరెడ్డిపల్లె, చిన్నకంబలూరు, యల్లావత్తుల, కోటకొండ, పెద్దకంబలూరు, అప్పనపల్లె గ్రామాల్లో ధాన్యం వర్షం కురియడంతో తడిచిపోయాయి. చేతికందిన పంటలు తడిచిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాతావరణ పరిస్థితులతో భయం



ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో భయమేస్తోంది. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియక ఆందోళన చెందుతున్నాం. ధాన్యం రహదారిలో కుప్పలు పోసి ఉంచాను. వర్షానికి తడిస్తే అంతా నష్టపోవాల్సిందే. గత ఏడాది కంటే ఈ ఏడాది ధర తగ్గింది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- చాంద్‌బాషా, కౌలురైతు, శెట్టివీడు గ్రామం

టార్పాలిన్ పట్టలను అధికంగా వాడాల్సి వస్తోంది



వరి పైరు సాగు చేసి పైరుకోత చేసే సమయంలో అవస్థలు పడాల్సి వస్తోంది. పైరును యంత్రం ద్వారా నూర్పిళ్లు పూర్తి చేశాం. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు కూడా అవస్థలు పడుతున్నాం. వాతావరణమార్పులతో గింజే తేమ కూడా ఆరడం లేదు.

- ప్రసాదు, రైతు, శెట్టివీడు గ్రామం

మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరి

చాగలమర్రి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో న్యామతుల్ల పేర్కొన్నారు. శుక్రవారం చాగలమర్రి బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం, క్రీడా మైదానం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పీఎంశ్రీ పథకం కింద పాఠశాలలో క్రీడాభివృద్ధి కోసం రూ.2.49 లక్షలు ఖర్చు చేసి లాంగ్‌జంప్, వాలిబాల్, కబడ్డీ మైదానాల పనులు చేశారు. పరీక్షాపే చర్చా కార్యక్రమాన్ని హెచ్‌ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు.

పేకాటలో పట్టుబడితే జైలు: సీఐ

చాగలమర్రి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పేకాట ఆడుతూ పట్టుబడితే జైలు శిక్ష తప్పదని ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు హెచ్చరించారు. శుక్రవారం చాగలమర్రి పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేకాట ఆడుతూ పట్టుబడితే జైలుశిక్షతో పాటు రూ.3 లక్షలు పూచికత్తుతో పాటు మూడేళ్ల పాటు బైండోవర్ ఉంటుందని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు స్వస్థి పలకాలని అన్నారు. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. 31వ తేదీ రాత్రి యువత మద్యం తాగి వాహనాలను నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్‌రెడ్డి, ఏఎస్‌ఐ నబీసాహెబ్, పోలీసులు ఉన్నారు.

సర్వేలను వేగవంతం చేయండి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శివారెడ్డి

కొలిమిగుండ్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సర్వేలను వేగవంతం చేయాలని నంద్యాల డివిజనల్ పంచాయతీ అధికారి శివారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కనకాద్రిపల్లె, నందిపాడు, కొలిమిగుండ్ల గ్రామ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. గ్రామ సచివాలయాల పరిధిలో కొనసాగుతున్న ఎంఎస్ఎంఈ, పీఏసీఎస్, ఎస్సీ కాస్ట్, లిస్ట్ పబ్లికేషన్స్ తదితర సర్వేలపై సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. సర్వేల స్థితిపై ఆరా తీశారు. మరోవైపు ఈ సర్వీసెస్ పెండింగ్ చలానాలు, ఇతర సంక్షేమ పథకాల అమలు అంశాలపై ఎంపీడీవో ప్రసాదరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. సర్వేలను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన వైసీపీ కన్వీనర్

కొలిమిగుండ్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల మండల వైసీపీ కన్వీనర్ అంబటి గుర్విరెడ్డి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని కలిశారు. శుక్రవారం బనగానపల్లెలో విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా వైసీపీ తలపెట్టిన ధర్నాకు మండలంలోని వివిధ గ్రామాల కార్యకర్తలు తరలి వెళ్లారు. కార్యక్రమంలో బెలుం మహేశ్వరరెడ్డి, నందిపాడు గుర్విరెడ్డి, విష్ణు, గోర్విమానుపల్లె జగన్, అంబటి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ

కొలిమిగుండ్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయాలని టీడీపీ బనగానపల్లె నియోజకవర్గ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో మండల ఆర్‌ఎంపీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని సీఐ రమేష్‌బాబుతో కలిసి వీఆర్ లక్ష్మీరెడ్డి ప్రారంభించారు. 50మంది యువతీ యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వెంకటమల్లారెడ్డి, సర్పంచ్ శివశంకర్, ఆర్‌ఎంపీ వైద్యులు చంద్రమోహన్‌గౌడు, వలి, సుబ్బరాయుడు, శివ, అయ్యప్పస్వాములు తిరుమలయ్య, సుబ్బరాయుడుస్వామి పాల్గొన్నారు.

సమన్వయంతో విధులు నిర్వర్తించాలి

సంజామల, డిసెంబరు 27: సచివాలయ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించాలని డీఎల్‌డీవో శివారెడ్డి కోరారు. శుక్రవారం ఎంపీడివో సాల్మన్‌తో కలిసి మండలంలోని ముదిగేడు, పేరుసోమల, ముక్కమళ్ల, ఆల్వకొండ గ్రామాల్లోని సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, సీనియర్ సిటిజన్ తదితర సర్వేలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రాధికారెడ్డి, కార్యదర్శి సుధాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వీఆర్‌వో గుర్రప్ప గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

పాత పద్ధతినే అమలు చేయాలి



రిలే నిరాహార దీక్షలో కూర్చున్న గనులు, ఫ్యాక్టరీల ట్రాక్టర్ల యజమానులు

బేతంచెర్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నాపరాళ్ల గనుల నుంచి ఫ్యాక్టరీలకు, ట్రాక్టర్ల ద్వారా ఫ్యాక్టరీలకు రవాణా చేసేందుకు రాయల్టీలను పాత పద్ధతిలోనే అమలు చేయాలని గనులు ఫ్యాక్టరీ, ట్రాక్టర్ల యజమానులు డిమాండ్ చేశారు. శుక్రవారం రిలే నిరాహారదీక్షలను ప్రారంభించారు. నాగేశ్వరరెడ్డి, నాగమయ్య మాట్లాడుతూ నాపరాళ్ల వ్యాపారాలు లేక గనుల ఫ్యాక్టరీల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాయల్టీలతో మరింత నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించే వరకు దీక్షలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మోహన్‌రావు, తిరుమలేష్ రెడ్డి, ఉపేంద్ర, ముస్తఫా తెలుగు వెంకటరమణ ఉన్నారు.

రిజిస్ట్రేషన్ ఉంటేనే పాస్‌పుస్తకాలు: ఆర్డీవో



ధృవపత్రాలను పంపిణీ చేస్తున్న ఆర్డీవో

ఉయ్యాలవాడ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): భూముల అమ్మకాలు, కొనుగోలుకు చెందిన రిజిస్ట్రేషన్లు ఉంటేనే పాసుపుస్తకాలు మంజూరు చేస్తామని నంద్యాల డివిజన్ ఆర్డీవో విశ్వనాథం తెలిపారు. శుక్రవారం మండలంలోని పడిగెపాడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ఇది చక్కటి అవకాశం అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కుల, ఆదాయ ధ్రువ పత్రాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్వో దాదాసాహేబ్, ఆయా గ్రామాల సర్వేయర్లు ఉన్నారు.

శింగనపల్లెలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

అవుకు, డిశంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శింగనపల్లె గ్రామంలో ఈనెల 30, 31 తేదీల్లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు సీఎస్‌ఐ చర్చి సంఘం పెద్దలు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా చర్చి సంఘం పెద్దలు మాట్లాడుతూ 2025 న్యూ ఇయర్ సందర్భంగా శింగనపల్లె గ్రామంలోని సీఎస్‌ఐ చర్చి ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. మొదటి బహుమతి రూ. 15వేలు, రెండవ బహుమతి రూ. 10వేలు, మూడో బహుమతి రూ. 5వేలు, నాలగవ బహుమతి రూ. 2వేలుగా ప్రకటించినట్లు తెలిపారు. కబడ్డీ పోటీల్లో పాల్గొనే వారు 29వ తేదీలోపు రూ. 500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

చాగలమర్రి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యశాఖ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తెలిపారు. శుక్రవారం చాగలమర్రి గ్రామంలోని మల్లేవేముల బస్టాండు సమీపంలో డ్రైడే, ఫ్రైడే సందర్భంగా మురికి నీరు ఉన్న ప్రదేశాలను వైద్య సిబ్బందితో కలిసి పరిశీలించారు. గృహాల వద్ద మురికి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అన్నారు. దోమలు కుడితే డెంగ్యూ, మలేరియా జ్వరాల బారిన పడే అవకాశం ఉందని అన్నారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు మాధవి, లీలావతి, ఆశా వర్కర్లు ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

చాగలమర్రి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ వర్కర్ కళావతి తెలిపారు. శుక్రవారం చాగలమర్రి 11వ అంగన్‌వాడీ కేంద్రంలో వీరబాలదివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గర్భిణులు, బాలింత మహిళలకు వివిధ వ్యాధులపై అవగాహన కల్పించారు. చిన్నారులు వేసిన వివిధ వేషాదారణలు అందరిని ఆకట్టుకున్నాయి. చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించి విద్యాభివృద్ధికి తోడ్పడాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

'ప్రైవేటు వ్యక్తులకు అప్పగించొద్దు'

బేతంచెర్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రైవింగ్ లైసెన్సు వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను ప్రభుత్వం ద్వారా ఆర్టీవో ఆఫీసు ద్వారా నుంచే జారీ చేయాలని, ప్రైవేటుపరం చేసే విధానాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయు అనుబంధమైన లారీ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి ఎల్లయ్య మాట్లాడుతూ ప్రైవేటు సంస్థలకు మంజూరు చేసే అవకాశాన్ని కల్పిస్తే ప్రజల ప్రాణాలకు నష్టం వాటిల్లుతోందన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ మారుతికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మద్దయ్య, మధు, బి.సంజీవ, రామాంజనేయులు, ఎస్. ఖాజాబాషా, ఏ.మాదన్న, రామచంద్రుడు, స్వామి నాయుడు, హరిప్రసాద్ శెట్టి, వెంకట్రాముడు, మధు, గోరంట్ల, మద్దయ్య పాల్గొన్నారు.

రైతులకు సేవలందించాలి



భార్గవ్‌రామ్, జగత్ విఖ్యాత్‌రెడ్డిలను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన వారు రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలందించాలని టీడీపీ ఆళ్లగడ్డ నియోజకవర్గ నాయకులు భార్గవ్‌రామ్, భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ మండలం చిన్న కందుకూరు గ్రామ సాగునీటి సంఘం అధ్యక్షుడు నూక నరసింహారెడ్డి, పలువురు టీడీపీ నాయకులు భార్గవ్‌రామ్, భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డిలను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు వేసి సన్మానించారు.

ఇంజనీరింగ్ విద్యార్థికి నివాళి : పట్టణంలోని సత్రం వీధికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి, భూమా కుటుంబ అభిమాని ఆకుల కల్యాణ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి కల్యాణ్ మృతదేహానికి నివాళి అర్పించారు. మృతుడి తల్లి, కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. భూమా కుటుంబం, కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

మాజీ ప్రధాని మృతికి సంతాపం



మాజీ ప్రధానమంత్రి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

చాగలమర్రి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి శుక్రవారం చాగలమర్రి జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో సంతాపం ప్రకటించారు. బ్రిలియంట్ ఉన్నత పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ అన్వర్‌బాషా, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు, పీడీ దాదాపీర్, పీఈటీ భారతి ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి



బోర్డు మీటింగ్‌లో మాట్లాడుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్ రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యమని ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. విజయవాడలోని ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం బోర్డు మీటింగ్‌ను నిర్వహించారు. రైతులకు అందించే సీడ్స్, ఉద్యోగుల పదోన్నతి తదితర అంశాలు అజెండాలో చర్చించారు. సమావేశంలో ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లు, బోర్డు మెంబర్లు పాల్గొన్నారు.

పోలీసుల చర్యలు అభినందనీయం

డోన్ రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని టీడీపీ పట్టణ నాయకులు వై.హనుమంతరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ వహించలేదన్నారు. డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్‌ఐలు, పోలీసులు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. ప్లైఓవర్ బ్రిడ్జి కింద బైకుల పార్కింగ్ కోసం చేపట్టిన పనులు అభినందనీయమని తెలిపారు.

పారిశ్రామికవేత్త హసన్ ఖాన్ మృతి



హసన్‌ఖాన్ (ఫైల్)

డోన్ రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త హసన్‌ఖాన్ (88) మృతి చెందాడు. పాతపేటలో నివాసముంటున్న హసన్‌ఖాన్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. పట్టణంలోని పలువురు పారిశ్రామికవేత్తలు ఆయన మృతికి సంతాపాన్ని తెలియజేశారు.

మహాసభలను జయప్రదం చేయండి



బనగానపల్లెలో మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

డోన్ రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటి సభ్యులు వెంకటసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. యుటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం పాతబస్టాండులో ప్రచార జాత కార్యక్రమం నిర్వహించారు. వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ జనవరి 4 నుంచి 8 వరకు కాకినాడలో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను అందరూపాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సుబ్బరాయుడు, సుధాకర్, జన విజ్ఞాన వేదిక నాయకులు మాణిక్యంశెట్టి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణే యూటీఎఫ్ ధ్యేయం

బనగానపల్లె: విద్యారంగాన్ని పరిరక్షించడమే యూటీఎఫ్ ధ్యేయమని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు సత్యప్రకాశ్ అన్నారు. శుక్రవారం బనగానపల్లెలోని పొట్టి శ్రీరాములు కూడలిలో యూటీఎస్ 50 సంవత్సరాల స్వర్ణోత్సవ ప్రచారరథం ద్వారా ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర సహాధ్యక్షుడు సురేశ్‌కుమార్ మాట్లాడుతూ 5,6,7,8 తేదీల్లో కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్ర 17వ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరప్రసాద్, సుధాకర్, సహాధ్యక్షులు సత్యప్రకాశ్, దస్తగిరి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, డిసెంబరు 27, (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో ప్లాస్టిక్‌ను నిషేధించాలంటూ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే భారీ ర్యాలీని విజయవంతం చేయాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పర్యావరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పట్టణ ప్రజలను కోరారు. 'నా బనగానపల్లె.. నా ఆరోగ్యం' కార్యక్రమంలో భాగంగా గత రెండు నెలలుగా బనగానపల్లె పట్టణంలోని అన్ని వ్యాపార సంస్థల యజమానులు, ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల యాజమాన్యం విద్యార్థులచే ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించామన్నారు. ఈ ర్యాలీకి తరలిరావాలని బీసీ ఇందిరమ్మ పిలుపునిచ్చారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి: వైసీపీ



ఆళ్లగడ్డలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పెంచిన విద్యుత్ చార్జీలను కూటమి ప్రభుత్వం వెంటనే తగ్గించాలని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి డిమాండ్ చేశారు. వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ చార్జీల బాదుడుపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని వైసీపీ శ్రేణులతో కలిసి పార్టీ కార్యాలయం నుంచి విద్యుత్‌శాఖ ఏడీఈ కార్యాలయం వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

బనగానపల్లె: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ ఏడీఏ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీలు పెంచి భారం వేసిందన్నారు. వైసీపీ కార్యాలయం నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి విద్యుత్ ఏడీఏ మద్దిలేటికి వినతిపత్రం సమర్పించారు.

డోన్ రూరల్: కూటమి ప్రభుత్వం తక్షణమే విద్యుత్ చార్జీలను తగ్గించాలని డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసనగా పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ కార్యాలయం నుంచి మోటారు బైకులపై విద్యుత్ ట్రాన్స్‌కో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ట్రాన్స్‌కో డీఈకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, వైసీపీ వాలంటరీ విభాగం జిల్లా అధ్యక్షులు పోస్టు ప్రసాద్, బేతంచెర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, డోన్ వైసీపీ నాయకులు, జడ్పీటీసీ సభ్యులు బద్దెల రాజ్‌కుమార్ సింగిల్ విండో మాజీ చైర్మన్ సోమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



డోన్ ట్రాన్స్‌కో డీఈకి వినతి పత్రం అందజేస్తున్న వైసీపీ నాయకులు



బనగానపల్లెలో ఏడీఏకు వినతి పత్రం అందజేస్తున్న జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, తదితరులు

బేతంచెర్ల: ఎన్నికల ముందు ఇచ్చిన హామీని విస్మరించి కూటమి ప్రభుత్వం పేద ప్రజలపై కరెంటు చార్జీలు పెంచడం సరైంది కాదని వైసీపీ నాయకులు, బేతంచెర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. శుక్రవారం విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ డోన్‌లో చేపట్టిన ధర్నాలో పాల్గొనేందుకు రైతులు, వైసీపీ నాయకులు కలిసి నల్ల కండువాలు ధరించి ధర్నాలో పాల్గొన్నారు.